

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ అన్నారు. - 8లో



ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు

వివిధ ప్రకటనలు, ప్రారంభోత్సవాలకు భువనగిరి పట్టణంలో ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేస్తున్నారు. - 9లో

గరిష్టం/కనిష్టం 37°/24°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

యాదగిరి క్షేత్రంలో నిత్యారాధనలు



శివాలయంలో స్పటిక లింగానికి పూజలు చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో సోమవారం ఆధ్యాత్మిక పర్వాలు కొనసాగాయి. కొండపైన అనుబంధ ఆలయమైన శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం, బిల్వా అర్చన పూజలు విశేషంగా నిర్వహించారు. మహా శివుడికి ఇష్టమైన రోజు కావడంతో అభిషేక పూజలను విశేషంగా చేపట్టారు. ఇక ప్రధానాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సంప్రదాయ పూజలను కొనసాగించారు. ఆలయంలో వైభవంగా నిత్య కల్యాణ వేడుక, జోడు సేవలు వంటి పూజలను అర్చకులు జరిపించారు.

జూన్ 14న జాతీయ లోక్ అదాలత్

భువనగిరిటౌన్ : జూన్ 14న సబ్ నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించబడుతుందని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వి.మాధవిలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని సివిల్, క్రిమినల్ కాంపౌండబుల్, ప్రీ లిటిగేషన్ విషయాల పరిష్కారం కోసం ప్రీ సిట్టింగ్‌లను నిర్వహిస్తోందని పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్ దృష్ట్యా జిల్లాలోని ప్రతి కోర్టులో లోక్ అదాలత్ బెంచ్‌లను ఏర్పాటు చేస్తోందని, వీటిని కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం చేయాలని కోరారు.

అసైన్డ్ భూములు అమ్మినా, కొన్నా నేరమే



మాట్లాడుతున్న ఆర్డీఓ కృష్ణారెడ్డి

ఆత్మకూరు(ఎం): అసైన్డ్ భూములు అమ్మినా..కొన్నా నేరమేనని, ఒకవేళ కొనుగోలు చేసిన వారందరికీ పీఓటీ చట్టం ప్రకారం నోటీసులు అందజేసి ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని ఆర్డీఓ కృష్ణారెడ్డి అన్నారు. ఇటీవల పైలెట్ ప్రాజెక్టు కింద నిర్వహించిన రెవెన్యూ సదస్సుల సందర్భంగా వచ్చిన అర్జీలపై సోమవారం ఆత్మకూర్(ఎం) తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాధీనం చేసుకున్న అసైన్డ్ భూములను సన్న, చిన్నకారు రైతులను గుర్తించి వారికి పంపిణీ చేస్తామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో మిగిలిన ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వి.లావణ్య, డీటీ ఎండి షఫీయొద్దీన్, ఆర్ఐ వై.మల్లిఖార్జునరావు, సంజీవ, రవి, నవనీత పాల్గొన్నారు.

విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలి




శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థినులతో డీఈఓ, ఉపాధ్యాయులు

భూదాన్‌పోచంపల్లి : వేసవి శిక్షణ శిబిరంలో నేర్చుకొన్న జ్ఞానాన్ని నిజ జీవితానికి అన్వయించుకుని విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలని డీఈఓ సత్యనారాయణ అన్నారు. సోమవారం భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురంలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో 15 రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి వేసవి శిక్షణ శిబిరం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో విజ్ఞానం, వినోదం, మానసిక వికాసం కల్పించాలనే లక్ష్యంతో వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహించామని పేర్కొన్నారు. శిక్షణలో వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జెండర్ ఈక్విటీ కోఆర్డినేటర్ సీహెచ్ రాధ, క్యాంప్ కోఆర్డినేటర్ ఇందిర, అసిస్టెంట్ కోర్డినేటర్ కల్పన, ఆయా కేజీబీవీల స్పెషల్ ఆఫీసర్లు భావని, దుర్గ, శివరంజని, సీఆర్‌టీలు, పీజీ సీఆర్‌టీలు, పీఈటీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

హైస్పీడ్ రైల్వే లైన్లు!

సూర్యాపేట మీదుగా శంషాబాద్ - విశాఖపట్నం హైస్పీడ్ కారిడార్‌కు కేంద్రం ఓకే

- ఫైనల్ లొకేషన్ సర్వేకు నిధులు
- డోర్నకల్ – గద్వాల కొత్త లైన్‌కు గ్రీన్ సిగ్నల్
- కొత్త లైన్లు, డబ్లింగ్ పనులకు నిధులు కేటాయింపు
- రైల్వే స్టేషన్లలో సదుపాయాల కల్పన
- నిధుల కేటాయింపు వివరాలను పింక్ బుక్‌లో వెల్లడించిన రైల్వే శాఖ



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : సూర్యాపేట జిల్లా కేంద్రం మీదుగా రెండు రైల్వే లైన్లు రానున్నాయి. హైస్పీడ్ రైల్ కారిడార్ కింద శంషాబాద్ నుంచి విశాఖపట్నం వరకు ప్రతిపాదించిన రైల్వే లైన్ ఫైనల్ లొకేషన్ సర్వేకు (ఎఫ్ఎల్ఎస్) కేంద్ర రైల్వే శాఖ ఓకే చెప్పింది. అలాగే సూర్యాపేట, నల్లగొండ మీదుగా డోర్నకల్ – గద్వాల లైన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మరోవైపు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలు రైల్వే పనులకు నిధులను కేటాయించింది. రైల్వే బడ్జెట్ ద్వారా దక్షిణ మధ్య రైల్వే పరిధిలో పలు ప్రాజెక్టులు, ఎఫ్ఎల్ఎస్‌లకు కేటాయించిన నిధుల వివరాలతో కూడిన పింక్ బుక్‌ను ఇటీవల విడుదల చేసింది.

కొత్త లైన్లు, డబ్లింగ్ పనులకు నిధులు ఇలా..

- మాచర్ల నుంచి నల్లగొండ వరకు 92 కిలోమీటర్లు పొడవునా రూ.458.26 కోట్లతో కొత్త రైల్వే లైన్‌కు ఓకే చెప్పింది. దానికి సంబంధించిన సేఫ్టీ పనుల కోసం రూ.20 లక్షలు కేటాయించింది.
- రూ.77.80 కోట్లతో విష్ణుపురం నుంచి జాన్‌పహాడ్ వరకు 11 కిలోమీటర్ల పొడవునా కొత్తలైన్‌ను ఏర్పాటు చేసేందుకు అంగీకరించింది. దీనికి సేఫ్టీ ఫండ్స్ కింద రూ.5 కోట్లు కేటాయించింది.
- జగ్గయ్యపేట నుంచి మేళ్లచెరువు వరకు 19.1 కిలోమీటరు పొడవునా కొత్త లైన్‌కు ఓకే చెప్పింది. దాంతోపాటు మేళ్లచెరువు–జాన్‌పహాడ్ లైన్ 24 కిలోమీటర్ల పొడవునా ఆధునుకీకరణ పనులకు రూ.513.20 కోట్లు కేటాయించింది.
- ఘట్‌కేసర్ నుంచి బీబీనగర్ వరకు 14.25 కిలోమీటర్ల పొడవునా 3, 4 లైన్ల డబ్లింగ్ చేసేందుకు ఎఫ్ఎల్ఎస్‌కు ఓకే చెప్పింది. ఇందుకు రూ.29 లక్షలు కేటాయించింది.
- భువనగిరి– బీబీనగర్ మధ్య 15 కిలోమీటర్ల పొడవునా 3వ లైన్ డబ్లింగ్‌కు ఎఫ్ఎల్ఎస్‌కు రూ.30 కోట్లు కేటాయించింది.
- ఘట్‌కేసర్ నుంచి రాయగిరి వరకు ఎంఎంటీఎస్ ఫేజ్ –2 విస్తరణకు ఓకే చెప్పింది. దీనికి వివిధ పద్దుల కింద రూ. 110 కోట్లు కేటాయించింది.
- అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద యాదాద్రిలో ర్యాంపులతో కూడిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులను కేటాయించింది. అలాగే యాదాద్రిలో 4 కిలోమీటర్ల పొడవునా బైపాస్, రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన ఎఫ్ఎల్ఎస్‌కు ఓకే చెప్పింది.
- గుంటూరు– బీబీనగర్ మధ్య డబ్లింగ్‌కు సంబంధించిన ఎఫ్ఎల్ఎస్‌కు రూ.3.10 కోట్లు, బీబీనగర్–భువనగిరి మధ్య డబ్లింగ్ కోసం ఎఫ్ఎల్ఎస్‌కు రూ.30 లక్షలు కేటాయించింది.
- గుంటూరు–బీబీనగర్ మధ్య రూ.2,853 కోట్లతో చేపట్టే డబ్లింగ్‌కు, రూ.110.89 కోట్లతో విష్ణుపురం వద్ద బైపాస్ లైన్ నిర్మాణానికి ఓకే చెప్పింది.
- మోతుమర్రి– విష్ణుపురం మధ్య డబ్లింగ్‌కు నిధులను కేటాయిచింది.
- రూ.3.32 కోట్లతో మిర్యాలగూడ గూడ్స్ షెడ్‌ను అభివృద్ధి చేయనుంది.

ఏళ్ల నాటి కల..

సూర్యాపేట జిల్లా కేంద్రానికి రైల్వే కనెక్టివిటీ కోసం ప్రజలు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. గతంలో పలుమార్లు కొత్త రైల్వే లైన్లను ప్రతిపాదించినా అవి కాగితాలకే పరిమితమయ్యాయి. అయితే, విశాఖపట్నం నుంచి విజయవాడ, సూర్యాపేట మీదుగా శంషాబాద్ వరకు, అదే విధంగా విశాఖపట్నం నుంచి విజయవాడ మీదుగా కర్నూల్‌కు హైస్పీడ్ రైల్వే కారిడార్ కోసం ప్రిలిమినరీ ఇంజనీరింగ్ ట్రాఫిక్ (పెట్) సర్వేను చేపట్టింది. ఆ సర్వే గతేడాది చివరలో పూర్తి కావడంతో దానిని ఈ ఏడాది బడ్జెట్‌లో పొందుపరిచింది. తాజాగా ఆ కొత్తలైన్ ఎఫ్ఎల్ఎస్‌కు కేంద్రం 4.71 కోట్ల రూపాయలు కేటాయించింది. ఇది కార్యరూపం దాల్చితే గంటకు 220 కిలోమీటర్ల వేగంతో నడిచే హైస్పీడ్ రైల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. మరోవైపు 296 కిలోమీటర్ల పొడవున సూర్యాపేట, నల్లగొండ, నాగర్‌కర్నూల్, వనపర్తి మీదుగా గద్వాల వరకు డోర్నకల్ – గద్వాల కొత్త రైల్వే లైన్ ఎఫ్ఎల్ఎస్‌కు ఓకే చెప్పింది. దానికి 7.40 కోట్ల రూపాయలు కేటాయించింది. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ ఏర్పడనుంది.

సదుపాయాలకు ప్రాధాన్యం

- నల్లగొండ, మిర్యాలగూడ రైల్వే స్టేషన్లలో కనీస మౌలిక సదుపాయాలు కల్పన, వికలాంగులకు వసతుల కల్పన కోసం ఒక్కో స్టేషన్‌కు రూ.1.30 కోట్లు కేటాయించింది.
- నల్లగొండ, మిర్యాలగూడ రైల్వేస్టేషన్ల ఆవరణ, పరిసరాలను బాగు చేసేందుకు ఒక్కో స్టేషన్‌కు రూ.5.7 కోట్ల చొప్పున కేటాయింది.
- రూ.2.76 కోట్లతో నల్లగొండ రైల్వే స్టేషన్‌లో 12 మీటర్ల వెడల్పు కలిగిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జితోపాటు రెండు ఎస్కలేటర్లను ఏర్పాటు చేయనుంది.
- చర్లపల్లి– ఘట్‌కేసర్ మధ్య 12వ క్రాసింగ్‌వద్ద రోడ్‌ఓవర్ బ్రిడ్జి, నల్లగొండ – తిప్పర్తి మధ్య అదనపు బాక్స్ బ్రిడ్జి, నల్లగొండ – శ్రీరామ్‌పురం మధ్య బాక్స్ బ్రిడ్జి పునర్నిర్మాణానికి నిధులను కేటాయించింది.
- పగిడిపల్లి–భువనగిరి, భువనగిరి శంకర్‌పల్లికి బైపాస్‌లకు సంబంధించిన ఇంజనీరింగ్ ట్రాఫిక్ సర్వేకు నిధులను కేటాయించింది.

త్యాగశీలి.. పుచ్చలపల్లి సుందరయ్య



సుందరయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రాఘవులు, వీరయ్య, సీతారాములు తదితరులు



అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న బీవీ రాఘవులు

- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు
- భువనగిరిలో సుందరయ్య విగ్రహావిష్కరణ

భువనగిరిటౌన్ : ఎర్రజెండా చేతబట్టి పేదల కోసం జీవితాంతం పోరాడిన త్యాగశీలి పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు అన్నారు. సోమవారం భువనగిరి జిల్లా కేంద్రంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ రైతాంగ విప్లవ పోరాట యోధుడు, దక్షిణ భారత దేశ సీపీఎం నిర్మాణంలో ప్రముఖుడు పుచ్చలపల్లి సుందరయ్య జయంతిని పురస్కరించుకొని ఆ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన అమర వీరుల కుటుంబాల ఆత్మీయ సమ్మేళన సభలో ఆయన ప్రసంగించారు. దేశంలో, రాష్ట్రంలో పాలకులు ప్రభుత్వ విద్య, వైద్యరంగాలను పూర్తిగా ధ్వంసం చేశారని విమర్శించారు. నర్సరీ చదివే బిడ్డలకు రూ.లక్షలు వసూలు చేస్తున్నా ప్రభుత్వాలు నియంత్రించడం లేదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వైద్యం కోసం వెళితే గాంధీ వైద్యశాలకు పొమ్మని చెబున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. విద్య, వైద్యం అనేది ప్రజల హక్కుగా ఉండాలన్నారు. కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య వైద్యం నేర్చుకుని ఎందరికో పురుడు పోశారన్నారు. ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకుంటున్న వారికి కామన్ హాస్‌లు నిర్మించి ఇవ్వాలన్నారు. పహల్గాం దాడిలో 28 మంది భారతీయులు చనిపోవడం బాధాకరమన్నారు. యుద్ధంతో సమస్యలు పరిష్కారం కావని చెప్పే కమ్యూనిస్టులను దేశద్రోహులని ముద్ర వేస్తున్నారన్నారు. కమ్యూనిస్టు భాషలో దేశ భక్తి అంటే ప్రజల భక్తి అని దేశ రక్షణ అని రాఘవులు పేర్కొన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్.వీరయ్య మాట్లాడుతూ నాటి తెలంగాణ రైతాంగ పోరాటం గురించి సుందరయ్య చేసిన త్యాగం గురించి నేటికీ ప్రజలు స్మరించుకుంటున్నారని తెలిపారు. పుచ్చలపల్లి సుందరయ్య, మల్లు స్వరాజ్యం లాంటి ఎందరో యోధుల త్యాగాలను ఆచరణలో పెట్టేందుకు యువ కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధన కోసం మనందరం పనిచేద్దామన్నారు. ఈ సందర్భంగా 45 మంది అమర వీరుల కుటుంబాలకు శాలువా కప్పి జ్ఞాపికలను అందజేశారు. ప్రజానాట్యమండలి కళాకారులు పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, నాయకులు కొండమడుగు నరసింహ, గూడూరు అంజిరెడ్డి, బట్టుపల్లి అనురాధ, మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, బూరుగు కష్ణారెడ్డి, గుండేటి శ్రీనివాస్ చారి, జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, బొల్లు యాదగిరి, ఎండి పాషా, గడ్డం వెంకటేష్, ముత్యాలు, మద్దెల రాజయ్య, దయ్యాల నరసింహ, బోలగాని జయరాములు, సిరిపంగ స్వామి, ముద్దాపురం రాజు, బోడ యాదిరెడ్డి, మల్లపల్లి లలిత పాల్గొన్నారు.

కలెక్టరేట్ మెయింటెనెన్స్‌కు చార్జీలు చెల్లించాలి

- ఉత్తర్వులు జారీ చేసిన అదనపు కలెక్టర్
- ప్రతినెలా ఇవ్వాలని ఆదేశాలు

భువనగిరిటౌన్ : జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం మెయింటెనెన్స్‌కు వివిధ శాఖల కార్యాలయాలు ప్రతినెలా చార్జీలు చెల్లించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ప్రభుత్వం మెయింటెనెన్స్ నిధులు కేటాయించినా ప్రస్తుతం ఇవ్వడం లేదు. దీంతో కలెక్టరేట్‌లోని వివిధ శాఖల కార్యాలయాలయాలు, గార్డెనింగ్, వివిధ రకాల నిర్వహణకు మొత్తం 17 మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి వేతనాలతో పాటు, శానిటేషన్ మెటీరియల్ కొనుగోలు ఇతర ఖర్చుల కోసం నిధులు లేకపోవడంతో మూడు నెలల నుంచి తీవ్ర ఇబ్బంది ఎదుర్కొటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులకు ప్రతి నెలా మెయింటెనెన్స్ చార్జీలు ఇవ్వాల్సిందిగా ఉత్తర్వులు అందాయి. ఆయా కార్యాలయాలు అక్రమించుకున్న ప్రదేశం బట్టి మాత్రమే వారికి ఫీజు వేశారు. ప్రతి నెల జీతాలు, నిర్వహణ తదితర ఖర్చులు రూ.2.54లక్షలు కావాల్సి ఉంది. ఈ మొత్తాన్ని కలెక్టరేట్‌లో ఉన్న 57 కార్యాయాలకు డివైడ్ చేసి ఖర్చు వేశారు.

ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించాలి

- ప్రజావాణిలో కలెక్టర్ హనుమంతరావు
- ప్రజల నుంచి 68 అర్జీలు స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరిటౌన్ : వివిధ సమస్యలపై ప్రజావాణిలో ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం భువనగిరి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి పలు ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. వివిధ శాఖలకు సంబంధించిన 68 అర్జీలు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, కలెక్టరేట్ ఏఓ జగన్‌మోహన్‌ప్రసాద్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్వీకరించిన అర్జీల్లో కొన్ని..

- వలిగొండ మండలం పులిగిల్ల గ్రామంలో కొనసాగుతున్న వలిగొండ–కాటేపల్లి రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని గ్రామానికి చెందిన ప్రజలు వినతిపత్రం అందజేశారు.
- బునాదిగాని కాల్వకు మరమ్మతులు చేయాలి తప్ప, విస్తరించే నిర్ణయం ఉపసంహరించుకోవాలని కోరుతూ బీబీనగర్ మండలం వెంకిర్యాల గ్రామ రైతులు వినతి పత్రం అందజేశారు.
- రాజాపేట మండలం రఘునాథపురం వాగులో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని రాజాపేట, యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా ఇసుక తరలింపును ఆపాలని గ్రామానికి చెందిన కె.శ్రీనివాస్‌వినతి పత్రం అందజేశారు.
- భువనగిరి పట్టణంలోని డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల పనులు వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని కోరుతూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్ వినతి పత్రం అందజేశారు.
- 350 రేషన్ షాపుల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యాన్ని తిరిగి తీసుకోవాలని, ప్రస్తుతం ఇస్తున్న సన్న బియ్యం తూకం వేసి ఇవ్వాలని పలువురు రేషన్ డీలర్లు కలెక్టర్‌కు విన్నవించారు.
- నా కుమారుడు ఆస్తి తీసుకుని నన్ను పోషించడం లేదని, నాకు న్యాయం జరిగేలా చూడాలని గుండాల మండలం అనంతరం గ్రామానికి చెందిన ఆది కమలమ్మ వినతి పత్రం అందజేశారు.

అధికారులు ఇచ్చిన హామీ నెరవేర్చాలి



ఎస్సీ హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్న నా కుమార్తె గాదె వైష్ణవి గతేడాది ఫిబ్రవరి 3న వసతి గృహంలో చనిపోయిన సందర్భంగా నాకు ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని అధికారులు ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేర్చలేదు. నా భార్య కూడా చనిపోయింది. నాకు వృద్ధ తల్లిదండ్రులు ఉన్నారు. కుటుంబ పోషణ భారంగా ఉంది. అధికారులు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలి.

– గాదె నాగరాజు, వైష్ణవి తండ్రి

అధికారుల పనితీరు మెరుగుపడాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు, పక్కన అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జెడ్పీ సీఈఓ శోభారాణి

సాక్షి, యాదాద్రి : అధికారుల పనితీరు మెరుగుపడాలని, రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలే ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్ డే అనంతరం ఫ్లాగ్ షిప్ ప్రోగ్రాంలపై మండల ప్రత్యేక అధికారులు, ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు ప్రొసీడింగ్స్ అందజేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా 160 ఇళ్లు బేస్మెంట్‌లు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు రూ.లక్ష వారి ఖాతాల్లో వేశామన్నారు. వర్షాకాలం సమీపిస్తున్నందున పునాది చేపట్టిన బేస్మెంట్ త్వరగా పూర్తి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జెడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అందని బిల్లు.. కదలని ఇల్లు



ఆలేరు మండలం మంతపురిలో బేస్మెంట్ పూర్తిచేసినా బిల్లురాని ఇల్లు

పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన గ్రామాలు 17	
మంజూరైన ఇళ్లు 762	బేస్మెంట్‌కు ముగ్గు పోసినవి 489
ముగ్గు పోయాల్సినవి 273	బేస్మెంట్లు పూర్తయిన ఇళ్లు 195
పెండింగ్‌లో ఉన్నవి 294	మొదటి బిల్లు రూ.లక్ష అందినవి 160
రూ.లక్ష బిల్లు అందనివారి సంఖ్య 30	
లెంటల్ లెవల్ పూర్తిచేసి బిల్లురాని వారు 08	

వలిగొండ మండలం నాతాళ్లగూడెం గ్రామాన్ని ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా తీసుకుంది. ఇక్కడ 98 మంది అర్హులని అధికారులు గుర్తించారు. అనంతరం విచారణ చేపట్టి కార్లు, ట్రాక్టర్లు ఉన్నాయని, గతంలో మీ కుటుంబ సభ్యులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని కొందరిని అనర్హులుగా గుర్తించారు. చివరకు 22 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఇందులో 18 మంది లబ్ధిదారులు ముగ్గులు పోసుకొని బేస్మెంట్ నిర్మించుకుంటున్నారు. గ్రామానికి చెందిన జూకంటి మనోహరమ్మ ఇల్లు త్వరలో స్లాబ్ కూడా నిర్మాణం జరగనుంది. ఈమెకు ఇప్పటి వరకు మొదటి విడతగా రూ.లక్ష బిల్లు మాత్రమే వచ్చింది. దీంతో ఈమె బిల్లు కోసం ఎదురుచూస్తోంది. ఈ పరిస్థితి పైలట్ ప్రాజెక్టు గ్రామాల్లోనే కాక ఇతర మండలాల్లోనూ నెలకొంది.

పైలట్ గ్రామాల్లో ముందుకు సాగని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

- బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం
- బేస్మెంట్‌లు పూర్తిచేసినా కొంతమందికి అందని మొదటి బిల్లు
- లెంటల్ లెవల్ బిల్లుల కోసం మరికొందరి ఎదురుచూపు

సాక్షి, యాదాద్రి : జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన 17 గ్రామాల్లో సకాలంలో బిల్లులు అందక ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగడంలేదు. మరో వారం రోజుల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటన నేపథ్యంలో బేస్మెంట్లు ప్రారంభించి పూర్తిచేయాలని అధికారులు అంటున్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు అందిస్తామని నిర్ణయించింది. ఇందులో బేస్మెంట్ పూర్తికాగానే రూ.లక్ష, గోడలు, స్లాబ్ వరకు రూ. లక్ష, స్లాబ్ పూర్తికాగానే రూ.2 లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తి కాగానే మిగతా రూ.లక్ష అందించాల్సి ఉంది. అయితే లబ్ధిదారుల ఖాతాల్లో ప్రతి సోమవారం జమ కావాల్సిన బిల్లుల ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. దీంతో అప్పులు చేసి ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని లబ్ధిదారులు అంటున్నారు. మరోవైపు నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయని, గతంలో ఇందిరమ్మ ఇల్లు వచ్చిందని, నిబంధనలకు విరుద్ధంగా 400 నుంచి 600 చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మాణాలు చేపడుతున్న వారి ఇళ్లను రద్దు చేస్తున్నారు. దీనికితోడు స్టీల్, సిమెంట్, ఇసుక ధరలతో పాటు సుతారీ మేస్త్రీల కూలి ఖర్చులు భారీగా పెరగడంతో ముందస్తుగా వాటి చెల్లింపులకు డబ్బులు లేక కొందరు నిరుపేదలు ఇళ్ల నిర్మాణ విషయంలో వెనకడుగు వేస్తున్నారు.

కదిరేణిగూడెంలో ఒక్కరికే రూ.లక్ష

మోటకొండూర్ మండలంలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి పైలట్ ప్రాజెక్టుగా కదిరేణిగూడెం గ్రామాన్ని ఎంపిక చేశారు. ఇక్కడ మొత్తం 21 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. అందులో స్క్రూట్నీలో 10 తొలగించారు. 11 ఇళ్లకు ప్రొసీడింగ్స్ ఇచ్చారు. అందులో ఎనిమిది ఇళ్ల పనులు ప్రారంభించారు. ఇందులో ఒకరికి మాత్రమే బేస్మెంట్ దశ పూర్తి చేయగా ప్రభుత్వం నుంచి రూ.లక్ష నిధులు అందాయి. మిగిలిన వారికి బిల్లులు విడుదల కాకపోవడంతో వారి ఇళ్ల నిర్మాణాలు కొనసాగడం లేదు.

బేస్మెంట్ పెద్దగా ఉందని ఇల్లు రద్దు చేశారు



“ మాకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కావడంతో పిల్లర్లతో బేస్మెంట్ నిర్మించుకున్నాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కాకుండా పెద్దగా నిర్మించారని అధికారులు ఇంటిని రద్దు చేశారు. మాకు ఇల్లు లేక మా పెద్దల ఇంట్లో ఉంటున్నాను. ప్రభుత్వం వెంటనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి.

– గంగాపురం సువర్ణ, నాతాళ్లగూడెం, వలిగొండ మండలం

బిల్లు కోసం ఎదురుచూస్తున్నా



“ బేస్మెంట్ పూర్తయి నెల రోజులు అవుతుంది. రూ.లక్ష డబ్బులు ఇంతవరకు ఖాతాలో జమ కాలేదు. అధికారులు అడిగితే సమాధానం దాట వేస్తున్నారు. చేతిలో ఒక్క పైసా లేకపోవడంతో నిర్మాణ పనులు ఆగిపోయి 20 రోజులు దాటింది. డబ్బులు ఖాతాలో జమ చేస్తే ఇటుక, సిమెంట్ తెచ్చుకుంటా.

– కొరుటూరి నరసమ్మ, మంతపురి, ఆలేరు మండలం

వెయ్యి చదరపు అడుగులకు పెంచాలి



“ నాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. రూ.2 లక్షలు ఖర్చు చేసి బేస్మెంట్ నిర్మాణం పూర్తి చేశాను. ఇందిరమ్మ ఇంటిని 600 చదరపు అడుగుల విస్తీర్ణంలోనే పూర్తిచేయాలనే నిబంధన బాగా లేదు. వెయ్యి చదరపు అడుగుల్లో ఇల్లు కట్టుకునేలా నిబంధనను సడలిస్తే బాగుంటుంది.

– షేక్ సాబేర్, బోయిన్‌పల్లి, బొమ్మలరామారం మండలం

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడు మృతి


కార్తీక్‌రెడ్డి (ఫైల్)

హుజూర్‌నగర్‌రూరల్‌: పాముకాటుకు గురైన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. సోమవారం మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్‌ మండలం వేపలసింగారం గ్రామానికి చెందిన గుజ్జుల కార్తీక్‌రెడ్డి (33) వరికోత మిషన్‌ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల వరికోతలు కోయడానికి మెదక్‌ జిల్లాలోని కాగితంపల్లికి వెళ్లాడు. ఈ నెల 11వ తేదీన అక్కడ వరి పొలం కొస్తుండగా కోత మిషన్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో కార్తీక్‌రెడ్డి కోత మిషన్‌ కిందకు దిగి పరిశీలిస్తుండగా పాము కాటేసింది. కార్తీక్‌రెడ్డి కేకలు వేయడంతో అక్కడే ఉన్న రైతులు గమనించి సమీపంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిఇ తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. మృతుడు అవివాహితుడు. అతడి తండ్రి గతంలోనే మృతిచెందగా.. తల్లి, ఇద్దరు తమ్ముళ్లతో కలిసి ఉంటున్నట్లు బంధువులు తెలిపారు.

ట్రాక్టర్‌ బోల్తా.. మహిళ మృతి


పద్మ (ఫైల్)

మోటకొండూర్‌ : ట్రాక్టర్‌ బోల్తా పడి మహిళ మృతిచెందింది. ఈ ఘటన మోటకొండూర్‌ మండలం కాటేపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగుల ఉపేందర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మోటకొండూర్‌ మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన పీట్ల పద్మ(45), నరసింహ దంపతులు బండ కొట్టి జీవనం సాగిస్తున్నారు. సోమవారం ఉదయం నాంచారిపేటలో గ్రానైట్‌ రాయి కొట్టి తమ సొంత ట్రాక్టర్‌లో లోడ్‌ చేసుకుని కాటేపల్లి గ్రామంలో అన్‌లోడ్‌ చేసి వస్తుండగా.. కాటేపల్లి సమీపంలోని బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయే క్రమంలో ట్రాక్టర్‌ అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పద్మ అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి కుమారుడు మత్స్యగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉంది.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు..

హుజూర్‌నగర్‌ : తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన హుజూర్‌నగర్‌లో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్‌ పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన నర్సింగ్‌ ధనమూర్తి (49) కల్లు గీస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజుమాదిరిగానే సోమవారం కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. కల్లుగీస్తూ ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. స్థానికులు గమనించి అతడిని స్థానిక ఏరియా హాస్పిటల్‌కు తరలించగా.. అప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ సంఘ నాయకులు వల్లపు దాసు కృష్ణగౌడ్‌, అమర్‌గౌడ్‌ కోరారు.

బాలుడిపై పోక్సో కేసు

మోత్కూర్‌ : బాలికను లైంగికంగా వేధించిన మోత్కూర్‌ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి సోమవారం జువైనల్‌ హోంకు తరలించారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేయగా.. సదరు బాలుడు బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తమ విచారణలో తేలడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ డి. నాగరాజు తెలిపారు.

కారు బీభత్సం.. యువకుడి మృతి

- మూడు ద్విచక్ర వాహనాలు, కారు ధ్వంసం
- నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం వద్ద ఘటన


రెండు ముక్కలైన స్కూటీ


నుజ్జునుజ్జయిన ప్రమాదానికి కారణమైన కారు


అక్కెనపల్లి సునీల్‌ (ఫైల్‌)

నార్కట్‌పల్లి: కారు అదుపుతప్పి మూడు ద్విచక్ర వాహనాలు, మరో కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఆర్‌. శృతుత్‌రెడ్డి, అతడి భార్య శ్రావణిరెడ్డి, అత్త వసంత కలిసి సోమవారం గుంటూరు నుంచి కారులో హైదరాబాద్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యలో నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం వద్దకు రాగానే ముందు వెళ్తున్న స్కూటీని ఢీకొట్టారు. దీంతో స్కూటీపై ప్రయాణిస్తున్న నార్కట్‌పల్లి మండలం అక్కెనపల్లి గ్రామానికి చెందిన అక్కెనపల్లి సునీల్‌(33) అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం కారు అదుపుతప్పి రహదారి పక్కనే నిలిపి ఉంచిన రెండు ద్విచక్ర వాహనాలతో పాటు మరో కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న శృతుత్‌రెడ్డి, అతడి భార్య, అత్తకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న నార్కట్‌పల్లి ఎస్‌ఐ క్రాంతికుమార్‌ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులతో పాటు సునీల్‌ మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పెళ్లైన మూడు నెలలకే..

అక్కెనపల్లి గ్రామానికి చెందిన సునీల్‌ అదే గ్రామానికి చెందిన యువతిని మూడు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. నల్లగొండలో భార్యతో కలిసి నివాసముంటూ అక్కడే ప్రైవేట్‌ జాబ్‌ చేస్తున్నాడు. సోమవారం గ్రామంలో బియ్యం తీసుకొచ్చేందుకుగాను తన స్నేహితుడి స్కూటీని తీసుకుని స్వగ్రామం బయల్దేరగా.. మార్గమధ్యలో కారు ఢీకొట్టడంతో మృతిచెందాడు.

బావిలో దూకిన వివాహిత మృతదేహం లభ్యం

- న్యాయం చేయాలని పోలీస్‌ స్టేషన్‌ ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన


ఆత్మకూరు(ఎం) పోలీస్‌ స్టేషన్‌ వద్ద ఆందోళన చేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు

ఆత్మకూరు(ఎం): భర్త, అత్తింటి వారి వేధింపులు తాళలేక ఆదివారం రాత్రి వ్యవసాయ బావిలో దూకిన వివాహిత మృతదేహం సోమవారం తెల్లవారుజామున లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కంచనపల్లి గ్రామానికి చెందిన సంధ్యకు ఆత్మకూరు(ఎం) మండలం మొరిపిరాల గ్రామానికి కటికె కృష్ణతో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. భర్త కృష్ణ, అత్తమామలు మారెమ్మ, రాములు, బావ శ్రీను, తోటి కోడలు రమ్య వేధిస్తుండడంతో జీవితంపై విరక్తి చెందిన సంధ్య ఆదివారం సాయంత్రం ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో సిద్దాపురం రోడ్డు పక్కన వ్యవసాయ బావిలో దూకింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బావిలో నీరు ఎక్కువగా ఉండడంతో ఫైర్‌ సిబ్బంది సహాయంతో నీటిని బయటకు తోడించగా.. సోమవారం తెల్లవారుజామున సంధ్య మృతదేహం లభ్యమైంది. సంధ్య ఆత్మహత్య చేసుకోవడానికి కారకులైన వారిని శిక్షించే వరకు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తీసుకెళ్లనివ్వమని ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు అడ్డుకున్నారు. రామన్నపేట సీఐ ఎన్‌. వెంకటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని వారికి సర్దిచెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

పోలీస్‌ స్టేషన్‌ వద్ద ఆందోళన..

సంధ్య కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు సోమవారం ఆత్మకూరు(ఎం) పోలీస్‌ స్టేషన్‌ ఎదుట ఆందోళన చేపట్టారు. దోషులను పోలీసులు కాపాడుతున్నారని ఆరోపించారు. ఘటనా స్థలంలో దొరికిన సూసైడ్‌ నోట్‌లో రాసిన విధంగా సంధ్య భర్త కృష్ణ, అత్తమామలు మారెమ్మ, రాములు, బావ శ్రీను, తోటికోడలు రమ్యతో పాటు వారికి సహకరించిన శివనాగేష్‌, వాణి, రేణుక, స్వాతి, నాగమణి, మాలతిపై కేసు నమోదు చేయాలని డిమాండ్‌ చేశారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రామన్నపేట సీఐ ఎన్‌. వెంకటేశ్వరావు తెలిపారు. పోలీస్‌ స్టేషన్‌ వద్ద అవాంఛనీయ సంఘటనలు చేసుకోకుండా వలిగొండ, మోత్కూరు, గుండాల, అడ్డగూడూరు పోలీసులచే బందోబస్తు ఏర్పాటు చేశారు

పోలీసులు స్పందించి ఉంటే మా బిడ్డ బ్రతికేది..

తమ కుమార్తెపై భర్త, అత్తమామలు, బావ, తోటి కోడలు కలిసి అన్యాయంగా దొంగతనం కేసు పెట్టారని సంధ్య తల్లిదండ్రులు కెమిడి భైరయ్య, జయలక్ష్మి ఆరోపించారు. దొంగతనం కేసులో పోలీసులు కూడా తనను వేధిస్తున్నారని ఎన్నో సార్లు సంధ్య తమకు ఫోన్‌ చేసి చెప్పిందని వారు పేర్కొన్నారు. పోలీసులు స్పందించి న్యాయం చేసి ఉంటే తమ బిడ్డ బ్రతికేదని బోరున విలపించారు.

ఏఎమ్మార్పీ కాలువలో పడి వృద్ధురాలి గల్లంతు


వెంకటమ్మ (ఫైల్‌)

పెద్దఅడిశర్లపల్లి: ప్రమాదవశాత్తు ఏఎమ్మార్పీ ప్రధాన కాలువలో పడి వృద్ధురాలు గల్లంతయ్యింది. ఈ ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలంలో సోమవారం చోటు చేసుకుంది. గుడిపల్లి మండలం సింగరాజుపల్లి గ్రామానికి చెందిన ఓర్సు వెంకటమ్మ (60) సోమవారం పెద్దఅడిశర్లపల్లి మండలం వడ్డరిగూడెంలో ఉంటున్న తన కుమార్తె వద్దకు వచ్చి అక్కంపల్లి రిజర్వాయర్‌ కట్టపై నడుచుకుంటూ వెళ్తూ ఏకేబీఆర్‌ హెడ్‌ రెగ్యులేటర్‌ వద్ద గల ఏఎమ్మార్పీ ప్రధాన కాలువలో నీరు తాగేందుకు ప్రయత్నిస్తూ కాలువలో జారిపడి కొట్టుకుపోయింది. స్థానికులు గమనించి గుడిపల్లి పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ నర్సింహులు ఘటనా స్థలానికి చేరుకొని నీటి విడుదలను నిలిపివేసి గాలింపు చర్యలు చేపట్టినా ఆమె ఆచూకీ లభించలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ అదుపుతప్పి కాలువలో పడి..

వలిగొండ: బైక్‌ అదుపుతప్పి కాలువలో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన వలిగొండ మండలంలోని ఎదుళ్లగూడెం గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం వెలిమినేడుకు చెందిన అంతటి అజయ్‌కుమార్‌(26) ఓ ప్రైవేట్‌ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం వలిగొండ మండలం పొద్దుటూరులోని తన బంధువుల ఇంట్లో శుభకార్యానికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. తిరుగు ప్రయాణంలో ఏదులగూడెం సమీపంలో బైక్‌ అదుపుతప్పి కాలువలో పడి మృతిచెందాడు. వెనుక నుంచి వస్తున్న వ్యక్తి ప్రమాదాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి వెళ్లి పోస్టుమార్టం నిమిత్తం అజయ్‌కుమార్‌ మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి అంజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగంధర్‌ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

భువనగిరిటౌన్‌: భువనగిరి పట్టణంలో సోమవారం మధ్యాహ్నం తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణంలోని వసుంధర థియేటర్‌ ఎదురుగా నివాసముంటున్న ఆమిల్‌ రాకేష్‌ సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లాడు. గుర్తుతెలియని వ్యక్తులు రాకేష్‌ ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి బీరువాల్లో దాచిన రూ.2.60లక్షల నగదు, తులం బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. గేటు, ఇంటి దర్వాజా తీసి ఉండటం గమనించిన పక్కంటి వారు లోనికి వెళ్లి చూడగా కుటుంబ సభ్యులు ఎవరు లేకపోవడం, బీరువాలు తెరిచి ఉండటంతో చోరీ జరిగినట్లు గ్రహించి రాకేష్‌కు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ లక్ష్మీనారాయణ ఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. రాకేష్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

తిప్పర్తి: తిప్పర్తి మండలం కేశరాజుపల్లి గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడి మృతిచెందింది. సోమవారం తిప్పర్తి ఎస్‌ఐ సాయిప్రశాంత్‌ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌కు చెందిన కల్లేపల్లి శ్రీనివాసరాజు, అతడి భార్య పుణ్యలక్ష్మి (54), మరదలు తిరుమలరాజు సుజాత కలిసి ఆదివారం సికింద్రాబాద్‌ నుంచి ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం బాపట్ల జిల్లా నాగండ్ల గ్రామానికి వెళ్తుండగా.. తిప్పర్తి మండలం కేశరాజుపల్లి గ్రామ సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పుణ్యలక్ష్మి బలమైన గాయాలయ్యాయి. శ్రీనివాస్‌రాజు, సుజాతలకు స్వల్ప గాయాలయ్యాయి. పుణ్యలక్ష్మిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందింది. మృతురాలి భర్త శ్రీనివాసరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సాయిప్రశాంత్‌ తెలిపారు.

హత్య కేసులో నిందితులపై పీడీ యాక్ట్‌ నమోదు


నిందితులను చంచల్‌గూడ జైలుకు తరలిస్తున్న పోలీసులు

నూతనకల్‌: నూతనకల్‌ మండలం మిర్యాల గ్రామానికి చెందిన మెంచు చక్రయ్య హత్య కేసులో ఇద్దరు నిందితులపై పీడీ యాక్ట్‌ నమోదు చేసి హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు సీఐ నర్సింహారావు సోమవారం తెలిపారు. మార్చి 17న మెంచు చక్రయ్య హత్య జరగగా.. ఈ కేసులో ప్రధాన నిందితులైన కనకటి వెంకన్న అలియాస్‌ వెంకటేశ్వర్లు, కనకటి శ్రావణ్‌పై పీడీ యాక్ట్‌ నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు. కనకటి వెంకన్నపై 11 క్రిమినల్‌ కేసులు, కనకటి శ్రావణ్‌పై 7 క్రిమినల్‌ కేసులు ఉన్నాయని, వారు మళ్లీ ఇలాంటి నేరాలకు పాల్పడకూడదనే ఉద్దేశంతో పీడీ యాక్ట్‌ నమోదు చేసి సూర్యాపేట సబ్‌ జైలు నుంచి హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు తెలిపారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్‌


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ: ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై దాడి చేసి చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను నకిరేకల్‌ పోలీసులు అరెస్ట్‌ చేశారు. నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి సోమవారం తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించిన వివరాల ప్రకారం.. నకిరేకల్‌ పట్టణంలోని వీటీకాలనీలో ఒంటరిగా నివాసముంటున్న నాగులవంచ లక్ష్మమ్మ ఇంటికి ఈ నెల 17న ముగ్గురు వ్యక్తులు వచ్చి ఆమెపై దాడి చేసి, చేతులు కట్టేసి 3 తులాల బంగారు పుస్తెలతాడు, 4 రోల్డ్‌ గోల్డ్‌ గాజులు అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆదివారం సాయంత్రం నకిరేకల్‌ పట్టణంలోని తిప్పర్తి ఫ్లైఓవర్‌ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి యాక్టీవాపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు పారిపోతుండగా వారిని పట్టుకుని పట్టుకుని విచారించగా వారి వద్ద పుస్తెలతాడు దొరికింది. లక్ష్మమ్మపై దాడి చేసి చోరీ చేసింది తామేనని నిందితులు సత్యారం కృష్ణ అలియాస్‌ కృష్ణమూర్తి, మామిడి బాలకృష్ణ ఒప్పుకున్నారు. వీరితో పాటు మరో ఇద్దరు మల్లం నర్సింహ, ముష్టి వెంకటేశ్‌ కూడా ఈ చోరీలో పాలుపంచుకున్నారని డీఎస్పీ తెలిపారు. సత్యారం కృష్ణ మీద 31 కేసులు, మామిడి బాలకృష్ణపై 13 కేసులు, ముష్టి వెంకటేశ్‌పై ఒక కేసు ఉన్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. మల్లం నర్సింహ, మామిడి బాలకృష్ణ ఆరు నెలల క్రితం దొంగతనం కేసులో అరెస్టై చంచల్‌గూడ జైలులో కలిశారని, ఆ సమయంలో ఒంటరిగా ఉన్న మహిళలపై దాడి చేసి దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సీఐ రాజశేఖర్‌, ఎస్‌ఐలు లచ్చిరెడ్డి, సైదులు, సాయిప్రశాంత్‌, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌, రమేష్‌, సునీల్‌, కె. రవి పాల్గొన్నారు.

లారీని ఢీకొని గాయాలు

నాగారం: సూర్యాపేట–జనగామ జాతీయ రహదారిపై నాగారం బంగ్లా సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్‌ మండలం ఇస్తాలపురం గ్రామానికి చెందిన మున్న ప్రవీణ్‌ బైక్‌పై తిరుమలగిరి వైపు వెళ్తున్నాడు. నాగారం బంగ్లా సమీపంలోకి రాగానే బైక్‌ అదుపుతప్పడంతో ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ప్రవీణ్‌ తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాధితుడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

యాదగిరి స్థానాచార్యులుగా 'నల్లంథీఘల్‌'

- అదనపు బాధ్యతలు అప్పగింత

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రధానార్చకుడిగా విధులు నిర్వహిస్తున్న నల్లంథీఘల్‌ లక్ష్మీనరసింహచార్యులకు స్థానాచార్యులుగా దేవాదాయశాఖ అధికారులు అదనపు బాధ్యతలు అప్పగించారు. గత కొన్నేళ్లుగా ఆలయ స్థానాచార్యుల పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ఆ స్థానాచార్యుల పోస్టును ఆలయ ప్రధానార్చకుడిగా విధులు నిర్వహిస్తున్న నల్లంథీఘల్‌ లక్ష్మీనరసింహచార్యులకు అదనంగా బాధ్యతలను అప్పగిస్తు ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయంలో పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారంగా పూజల్లో స్థానాచార్యులు కీలకంగా బాధ్యతలు నిర్వహించనున్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సోమవారం స్వామివారి నిత్య కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కల్యాణాన్ని కమనీయంగా జరిపించారు. అదేవిధంగా క్షేత్రంలోని శివాలయంలో శ్రీపార్వతీ రామలింగేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్‌ చెన్నూరు విజయ్‌కుమార్‌, ఈఓ, అర్చకులు పాల్గొన్నారు.

ఇంటి పెద్ద.. మంచానికే పరిమితం

- భర్త కిడ్నీలు చెడిపోవడంతో దిక్కుతోచని స్థితిలో భార్య
- కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు రూ.11 లక్షలు అవసరం
- ఇప్పటికే వైద్యం కోసం రూ.20 లక్షలు ఖర్చు
- దాతల సాయం కోసం ఎదురుచూపులు


కన్నీటి గాథ


ఆస్పత్రిలో డయాలసిస్‌ చేయించుకుంటున్న రావుల ఉపేందర్‌

కనగల్‌: కుటుంబాన్ని పోషించాల్సిన ఇంటి పెద్ద రెండు కిడ్నీలు చెడిపోయాయి. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు రూ.11లక్షలు అవసరమని వైద్యులు చెప్పడంతో ఆ పేద కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉంది. దాతలు సాయం చేసి తన భర్తను కాపాడాలని భార్య వేడుకుంటోంది. వివరాలు.. కనగల్‌ మండల కేంద్రానికి చెందిన రావుల ఉపేందర్‌(34) రెండు కిడ్నీలు ఐదేళ్ల క్రితం చెడిపోయాయి. వైద్యం కోసం అప్పులు చేయడంతో పాటు తమకున్న అర ఎకరం భూమి అమ్మి రూ.20లక్షలు ఖర్చు చేశారు. ఉపేందర్‌ బీఈడీ వరకు చదివి కిడ్నీ వ్యాధితో మంచానికే పరిమితం కావడంతో అతడి భార్య స్రవంతి కూలీ పనులకు వెళ్లి మరీ కుటుంబాన్ని పోషిస్తోంది. వీరికి 7వ తరగతి చదివే కుమార్తె ఉంది.

ఉన్న భూమి మొత్తం అమ్మినా..

గత మూడున్నర ఏళ్లుగా రూ.8లక్షల వరకు అప్పులు తెచ్చి మరీ ఉపేందర్‌కు వైద్యం చేయిస్తున్నారు. ఏడాదిన్నర నుంచి వారానికి రెండు సార్లు నల్లగొండ పట్టణానికి వచ్చి డయాలసిస్‌ చేయించుకుంటున్నాడు. దీని కోసం ఉన్న అర ఎకరం భూమి అమ్మితే రూ.12లక్షలు వచ్చాయి. ఇప్పటి వరకు రూ.20లక్షలు ఖర్చు చేశామని, ఇక తమ వద్ద ఎలాంటి ఆస్తులు లేవని ఉపేందర్‌ భార్య స్రవంతి కన్నీటి పర్యంతమవుతోంది.

కిడ్నీ ఇచ్చేందుకు ముందుకొచ్చిన మేనమామ..

ఉపేందర్‌ అవస్థను చూసి ఉపేందర్‌ మేనమామ తన కిడ్నీని అల్లుడికి ఇచ్చేందుకు ముందుకొచ్చాడు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ 23న హైదరాబాద్‌లోని స్టార్‌ ఆస్పత్రిలో జరగనుంది. చేతిలో చిల్లిగవ్వ లేదని దాతలు ఆదుకోవాలని ఉపేందర్‌ భార్య స్రవంతి వేడుకుంటోంది.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- బ్రిటిష్‌ డిప్యూటీ హైకమిషనర్‌ గారెత్‌ విన్‌ ఓవెన్‌
- దండుమల్కాపురం గ్రీన్‌ ఇండస్ట్రియల్‌ పార్క్‌లోని రమణీ ఇండస్ట్రీస్‌ సందర్శన


రమణీ ఇండస్ట్రీస్‌లో బయోడిగ్రేడబుల్‌ సంచులను పరిశీలిస్తున్న గారెత్‌ విన్‌ ఓవెన్‌

చౌటుప్పల్‌ రూరల్‌: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని బ్రిటిష్‌ డిప్యూటీ హైకమిషనర్‌ గారెత్‌ విన్‌ ఓవెన్‌ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌ మండలం దండుమల్కాపురంలోని గ్రీన్‌ ఇండస్ట్రియల్‌ పార్క్‌లో ప్లాస్టిక్‌ ప్రత్యామ్నాయ సంచులను తయారు చేస్తున్న రమణీ ఇండస్ట్రీస్‌ను సోమవారం బ్రిటిష్‌ డిప్యూటీ హైకమిషనర్‌ సందర్శించారు. డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలు అందించిన సాంకేతిక సహకారంతో రమణి, డాక్టర్‌ ప్రసాద్‌లు నెలకొల్పిన రమణీ ఇండస్ట్రీస్‌లో బయో డిగ్రేడబుల్‌ సంచుల తయారీని పరిశీలించారు. ఉత్పత్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ బయో డిగ్రేడబుల్‌ సంచులను ప్రపంచం అంతటికీ ఎగుమతి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక సేవా దృక్పథంతో బ్యాగులు తయారు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం టిప్‌ కార్యాలయానికి వెళ్లి గ్రీన్‌ ఇండస్ట్రియల్‌ పార్క్‌లో చేపడుతున్న పరిశ్రమల వివరాలు తెలుసుకున్నారు. టిప్‌ మేనేజర్‌ శ్రీకాంత్‌.. పార్క్‌ అభివృద్ధిని, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం గురించి వివరించారు. ఇండస్ట్రియల్‌ పార్క్‌ పక్కనే ఉన్న టెక్స్‌టైల్‌ పార్క్‌లో తయారవుతున్న వస్త్రాల తయారీ విధానాన్ని చూశారు. మిమీ క్రాఫ్ట్స్‌ హస్తకళ కేంద్రాన్ని పరిశీలించారు. మిమీ క్రాఫ్ట్స్‌ నిర్వాహకులు బ్రిటిష్‌ డిప్యూటీ హై కమిషనర్‌ గారేత్‌ విన్‌ ఓవెన్‌ ను శాలువాతో సన్మానించారు.

రైతులను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

- నకిరేకల్‌ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


మాట్లాడుతున్న చిరుమర్తి లింగయ్య

చిట్యాల: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నకిరేకల్‌ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. చిట్యాలలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకొచ్చి ఇరవై రోజులు దాటినా కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి కొర్రీలు పెడుతూ రైస్‌ మిల్లర్లు దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. భూ భారతి, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అధికారులు బిజీగా ఉండి ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను పట్టించుకోవటం ఆరోపించారు. రైతులు నుంచి కొనుగోలు చేసిన సన్నధాన్యానికి బోనస్‌ ఇవ్వకుండా, కాంగ్రెస్‌ నేతలు పక్క రాష్ట్రాల నుంచి సన్నధాన్యం తీసుకొచ్చి బోనస్‌ కోసం ఇక్కడి కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం అందించాలని డిమాండ్‌ చేశారు. నియోజకవర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించటం లేదని, ఇచ్చిన హామీలను అమలు చేయటంలో అధికార పార్టీ విఫలమైందని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు అవుల అయిలయ్య, పీఏసీఎస్‌ మాజీ చైర్మన్‌ రుద్రారపు భిక్షం, మాజీ సర్పంచ్‌ సుంకరి యాదగిరిగౌడ్‌, మాజీ ఉప సర్పంచ్‌ బాతరాజు రవీందర్‌, బీఆర్‌ఎస్‌ జిల్లా నాయకుడు కొలను వెంకటేష్‌గౌడ్‌, జిట్ట శేఖర్‌ పాల్గొన్నారు.

స్వర్ణగిరీశుడికి వైభవంగా రథోత్సవ సేవ


రథోత్సవం సేవ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

భువనగిరి: భువనగిరి పట్టణంలోని స్వర్ణగిరి క్షేత్రంలో వేంకటేశ్వరస్వామికి సోమవారం సాయంత్రం శ్రావణ నక్షత్రం సందర్భంగా రథోత్సవ సేవ నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, స్వామి వారి జన్మ నక్షత్రం సందర్భంగా గిరిప్రదక్షిణ, సహస్రనామార్చన సేవ, నిత్య కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం 3వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనం పట్టివేత

చిట్యాల: విజయవాడ–హైదరాబాద్‌ హైవేపై చిట్యాల పట్టణంలో రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు వద్ద సోమవారం డీసీఎంలో అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్నట్లు చిట్యాల ఎస్‌ఐ అఫ్రీన్‌ నసీహా తెలిపారు. సూర్యాపేట వైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న డీసీఎంను తనిఖీల్లో భాగంగా ఆపగా.. అందులో 18 పశువులను గుర్తించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. డీసీఎంను సీజ్‌ చేసి.. పశువులను అక్రమంగా తరలిస్తున్న హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్‌కు చెందిన రషీద్‌, షేక్‌ ఆసిఫ్‌, చాంద్రాయణగుట్టకు చెందిన మహ్మద్‌ జాఫర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చింతపల్లి: అక్రమంగా తరలిస్తున్న గోవులను చింతపల్లి మండల కేంద్రంలో పోలీసులు పట్టుకున్నారు. చింతపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయం సమీపంలో ఆదివారం రాత్రి వాహనాల తనిఖీల్లో భాగంగా అశోక్‌ లేల్యాండ్‌ వాహనంలో తరలిస్తున్న 3 ఆవులు, 3 లేగదూడలను పోలీసులు పట్టుకున్నారు. కొండమల్లేపల్లి నుంచి హైదరాబాద్‌లోని కబేళాకు గోవులను తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దేవరకొండ మండలం ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన వాహన డ్రైవర్‌ ముచ్చర్ల కొండలుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.